ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు


పీపుల్స్ సర్వే స్లిప్పులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు


ఎమ్మెల్యే నాగిరెడ్డికి సర్వే రశీదులను అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత తదితరులు

గాజువాక: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ రెండో విడత కార్యక్రమాన్ని 65వ వార్డులోని బీసీ రోడ్ కాకతీయ జంక్షన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీపుల్స్ సర్వే చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా జరగనంతగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లోనే చేపడుతున్నామన్నారు. ప్రతి గడపలోనూ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజా స్పందనను చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లోనూ ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోందని చెప్పారు. కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు(కేబుల్ మూర్తి) అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు కులుకూరి మంగరాజు, పెద్దింటి మంగునాయుడు, సింగంపల్లి దేముడు, సూర్య ప్రకాష్, జానా సతీష్, పెంట్రరాజు, ఎర్రా సతీష్, మంత్రి మంజుల, రాంబాబు, ఎల్‌వీ రమణ, గండి అప్పలరాజు, విగ్నేష్, గొల్లపల్లి రాంబాబు, అర్జున్, అడిగర్ల రమణ పాల్గొన్నారు.

జగన్‌పైనే ప్రజల నమ్మకం

గాజువాక : తమ భవిష్యత్తు బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని 73వ వార్డులో పూర్తి చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రతి వార్డులోనూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నామని, జగన్‌మోహన్‌రెడ్డితోనే తమ భవిష్యత్తు బాగుంటుందని చెప్పారన్నారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే దీనికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు రాజాన వెంకటరావు, కంది పైడినాయుడు, గృహ సారథులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్లలో మరువలేని అభివృద్ధి


బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- మంత్రి అమర్‌నాథ్
- మడకపాలెంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

అగనంపూడి: మూడున్నరేళ్లలో కన్నూరు పంచాయతీ పరిధిలో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.9.57 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మరువలేని ప్రగతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేసిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. లంకెలపాలెం సమీపంలోని కన్నూరు పంచాయతీ పరిధిలోని మడకపాలెం గ్రామంలో రూ.75.10 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చేసి ప్రజల అభ్యున్నతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంక్షిస్తున్నారన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేయడం అంటే అన్ని వర్గాలను అభివృద్ధి బాటలో నడిపించడమేనని చెప్పారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఫార్మాసిటీ బాధిత తాడి గ్రామాన్ని తరలించి, పునరావాసం కల్పించిన తరువాతే మళ్లీ ఎన్నికలకు వెళ్లనున్నామన్నారు. తాడి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టిలో పెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, పరవాడ వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో హేమసుందరరావు, తహసీల్దార్ ప్రకాశరావు, ఎంఈవో సునీత పాల్గొన్నారు.

చురుగ్గా గడపగడపకు మన ప్రభుత్వం

మడకపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను మూడున్నరేళ్లలో నెరవేర్చి సంక్షేమ రాజ్యంగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ తీర్చిదిద్దారన్నారు. ఏ గడపను తట్టినా సంక్షేమం, అభివృద్ధి పలకరించాయని, దీంతో ప్రజలు వచ్చే ఎన్నికల్లో మనస్ఫూర్తిగా ముఖ్యమంత్రి జగన్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అదీప్‌రాజ్ చెప్పారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ


మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న దొడ్డి రమణ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు, హోమాలు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సమ్మింగి అప్పలరాజు, అండిబోయిన సన్నీ, దాడి దుర్గారావు, వరలక్ష్మి, శారద, విఘ్నేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: మిండి 11 కేవీ పరిధిలోని 132 కేవీ నేవల్ వాల్ఫ్ ఫీడర్ మరమ్మతు పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిండి గ్రామంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మొరాయించిన దువ్వాడ రైల్వేస్టేషన్ లిఫ్ట్


పనిచేయని లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో 20 రోజుల కిందట ప్రారంభించిన లిఫ్ట్ అప్పుడే మొరాయించింది. ఆరంభంలోనే మరమ్మతులు కావడం, గత నాలుగు రోజుల నుంచి లిఫ్ట్ పని చేయకపోవడంతో ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ఆరు మాసాల క్రితం లిఫ్ట్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. నత్తనడకన సాగిన పనులు ఎట్టకేలకు పూర్తి చేసి ప్రారంభించినా మూడు రోజుల ముచ్చటగా తయారైందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్ట్‌కు తక్షణం మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

కాంక్రీట్ మిక్సర్ లారీ బోల్తా


కాంక్రీట్ మిక్సర్ లారీని లేపుతున్న క్రేన్‌లు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో కాంక్రీట్ మిక్సర్ లారీ బోల్తా పడింది. ట్రాఫిక్ ఎస్‌ఐ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో అడవివరం వైపు నుంచి కాంక్రీట్ మిక్సర్ లారీ హనుమంతవాక వైపు బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్తుంది. రామకృష్ణాపురం సమీప ముడసర్లోవ డంపింగ్‌యార్డు కూడలి దాటిన వెంటనే ఆ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడి రోడ్డుకు అడ్డంగా తిరిగిపోయింది. దీంతో ఈ లైన్‌లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు, ఎస్‌ఐ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను పక్కనున్న మరో లైన్ ద్వారా మళ్లించారు. వాహనం యజమాని రెండు క్రేన్‌లు తీసుకొచ్చి బోల్తా పడిన మిక్సర్ వాహనాన్ని మధ్యాహ్నం 2 గంటలకు పక్కకు తరలించారు. మిక్సర్ లారీ బోల్తాపడిన సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మిక్సర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

'ఉక్కు పరిరక్షణకు మరో ముందడుగు'


802వ రోజు ఉక్కు దీక్షలో కూర్చున్న ఉద్యమ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును కాపాడుకొనే క్రమంలో కార్మికులంతా మరో ముందడుగు వేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 802వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పులువురు కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయని బీజేపీతో సహా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి సహకరించని అన్ని రాజకీయ పార్టీలపై ప్రజలు స్వచ్ఛందకు తమ నిరసన తెలియజేయాలన్నారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణకు ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేనిచో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ఏడాదిలో ఏఐటీయూసీతో ఒరిగింది శూన్యం'


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచి ఏడాది పూర్తయినా కార్మికులకు ఒరిగిందేమి లేదని స్టీల్ ఐఎన్‌టీయూసీ, మిత్రపక్షాల నాయకులు ధ్వజమెత్తారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల ప్రధాన డిమాండ్ వేతన ఒప్పందం చేయలేకపోయారన్నారు. ప్రైవేటీకరణ ఉద్యమంలో భాగంగా ఢిల్లీకి వెళ్తే తామే వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఉక్కు మంత్రి, ఉక్కు కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం తప్ప, ఏఐటీయూసీ, సీఐటీయూ చేసిందేమి లేదన్నారు. అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీలు ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, హెచ్‌బీఏ, వర్క్‌డ్రస్, ఇన్సెంటివ్ తగ్గింపు వంటి ఆర్థిక అంశాలపై కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ ఏఐటీయూసీ హయాంలో ఇప్పటికే కోక్‌ఓవెన్స్1, 2 బ్యాటరీలు ప్రైవేటు వారికి అప్పగించగా, మూడు, నాలుగు బ్యాటరీలకు, ఎస్.ఎం.ఎస్–2లో మిషన్–4కు నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, నాయకులు ప్రభాకరెడ్డి, నాయక్, రఫీ, కరణం సత్యారావు, పరదేశి, సుదర్శనం, ఎస్.శ్రీనివాసరెడ్డి, మొల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు


పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదలకు సేవ చేయడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సత్యసాయి సేవా సమితి పెదగంట్యాడ, సత్యసాయి భజన మండలి వెంపళ్లనగర్ ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో సత్యసాయి 12వ ఆరాధనోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు హాజరై సత్యసాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు నిత్యావసరాలను అందజేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం 70 మంది పేదలకు 22 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డిపో ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపో కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని డిపో ఎన్ఎంయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం గాజువాక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. డిపో అధికారులు సిబ్బందిపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి వార్షిక ఇంక్రిమెంట్లు నిలిపివేశారన్నారు. గ్యారేజి సిబ్బందిని అదనపు గంటలు పని చేయిస్తూ వేధిస్తున్నారని నాయకులు ఆరోపించారు. ట్రాఫిక్ పెరిగిపోవడంతో మహిళా ఉద్యోగుల విధులు పూర్తయ్యేటప్పటికి రాత్రి 11 గంటలు అవుతుందని, తద్వారా వారికి రవాణా, భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. డిపోలో కనీసం తాగునీటి సదుపాయం కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి జి.సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా విద్యుత్ వెలుగులు


ఆటోనగర్ బీ-బ్లాక్‌లో చెట్టు కొమ్మల మధ్య విద్యుత్ వెలుగులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ బీ–బ్లాక్‌లో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం పక్కనున్న రోడ్డులో విద్యుత్ వెలుగులు నిరుపయోగంగా మారాయి. లైట్లను చెట్లు కొమ్మలు మూసేయడంతో విద్యుత్ వెలుగులు ప్రసరించలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు ఉన్నా చీకట్లు ముసురుకున్నాయి. రోడ్లు పూర్తిగా అంధకారమయ్యాయి. ఇలా అధికారులు దృష్టి సారించి తక్షణం లైట్లకు అవరోధంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు

అగనంపూడి: లోటల్టేజీ సమస్య అధిగమించడానికి అగనంపూడి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం రెట్టింపు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఇ.ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. అగనంపూడి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఇప్పటి వరకు ఉన్న ఐదు ఎంవీఏ సామర్థ్యాన్ని పది ఎంవీఏ సామర్థ్యం స్థాయికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు వాటిని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ వందల కొద్ది అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరగడంతో ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్య తలెత్తిందన్నారు. సత్వర పరిష్కారానికి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని రెట్టింపు చేశామన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు ఆర్ఈసీఎస్ ఈఈ కె.రాజశేఖర్ చొరవతో రూ.70 లక్షలు వెచ్చించి సామర్థ్యాన్ని పెంచామన్నారు. స్థానిక ప్రజా సంఘాల విజ్ఞప్తి మేరకు అగనంపూడి పునరావాస కాలనీల విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు కాలనీల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటు విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ ఏడీఈ దాసరి శివశంకర్ ప్రసాద్, డీఈ రాజశేఖర్, డీఈఎం అండ్ పీఎం శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, ఏడీఈ వేణుగోపాల్, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

తేజస్వినికి జాతీయ బాల చిత్ర కళా అవార్డు


తేజస్వినిని అభినందిస్తున్న కేవీ సీనియర్ ఉపాధ్యాయురాలు అల్కా మిశ్రా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం 9వ తరగతి విద్యార్థిని అదపాక తేజస్వినికి జాతీయ స్థాయి బాల చిత్ర కళా అవార్డు లభించింది. ఇటీవల విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, అనంత్ డైమండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో 10వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తేజస్వినికి బాల చిత్ర కళా అవార్డు అందజేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తేజస్వినితో పాటు ఆర్ట్ టీచర్ దానయ్యను సైన్స్ సీనియర్ ఉపాధ్యాయురాలు అల్కా మిశ్రా, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే తేజస్విని సోదరుడు వేద భరద్వాజ్‌కు ఈ పోటీల్లో బంగారు పతకం లభించడం విశేషం. భరద్వాజ్ ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. దీంతో భరద్వాజ్‌ను కూడా ఉపాధ్యాయులు అభినందించారు.

రంగస్థల నటుడు కోరిబిల్లి ఆకస్మిక మృతి


మాధవరావు (ఫైల్ ఫొటో)

పెదగంట్యాడ: స్టీల్ హెచ్ఎంఎస్ మాజీ అధ్యక్షుడు, రంగస్థల నటుడు కోరిబిల్లి మాధవరావు (69) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కుకు చెందిన ఆయన 40 ఏళ్ల పాటు నాటక రంగానికి సేవలందించారు. 'నుదుటి రాత' అనే నాటకంలో రాజశేఖరం అనే తండ్రి పాత్రలో మెరిశారు. ఆ పాత్రకు నిండుదనం తీసుకువచ్చారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడం నాటక రంగానికి తీరని లోటని శ్రీసీతారామ నాట్య కళా సమితి ప్రతినిధులు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పాఠశాలల ప్రగతికి ప్రణాళికలు అవసరం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో పైడపునాయుడు

పెదగంట్యాడ: ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయంతో పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి పైడపునాయుడు సూచించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, అంతే స్థాయిలో బోధన సాగించాలన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్స్‌గా చింతల అగ్రహారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరహాలదొర, నరవ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీధర్ వ్యవహరించారు. సీఎంవో శిరీష, ఏపీవో అప్పలనాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో గంగవరం, ఇస్లాంపేట, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష ఆదరణ


ఆటోకు స్టిక్కర్లను అతికిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో రెండో విడత మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని 64వ వార్డు యాతపాలెంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటో స్టాండ్‌లోని ఆటోలకు స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ప్రజల మద్దతు కూడగట్టారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు


ఆటోనగర్‌లో ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 71వ వార్డు ఆటోనగర్ కాలనీలో సోమవారం సాయంత్రం కార్పొరేటర్ రాజాన రామారావుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించారన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయడానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న గాజువాక నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించినట్టు ఆయన తెలిపారు. రోడ్లు, కాలువలు, తాగునీటికి పెద్ద పీట వేశామన్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత సచివాలయ కార్యదర్శులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు రాజు, రవికిషోర్, వీరబాబు, ఈ.జి.ప్రసాద్, గోవిందరావు, డాక్టర్ పి.వి.రమేష్ రాజు, ఆర్.ఎస్.నాయుడు, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, పలు విభాగాల జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సహించేది లేదు'


పాదయాత్రలో పాల్గొన్న వామపక్ష నాయకులు

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సహించేది లేదని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా స్థానిక స్వతంత్రనగర్‌లో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ విధానాలు అప్రజాస్వామికమన్నారు. ఈ విధానాలను విడనాడకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, ఎ.లోకేష్, వై.నందన్న, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


పారిశుధ్య పనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం: సింహగిరితో పాటు అడవరం, కొండదిగువన పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రజా ఆరోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం అనంతరం సోమవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను వెంటనే డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. పాత అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల గోశాల వరకు ఎక్కువగా వ్యర్థాలు ఉన్నాయని రెండు పూటలా పారిశుధ్య కార్మికులను ఉంచి శుభ్రం చేయించాలని సూచించారు. చెత్త తరలించే వాహనాలు అదనపు ట్రిప్పులు వేయాలని ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఈఈ సంతోషి పాల్గొన్నారు.

27 నుంచి వేసవి శిక్షణ శిబిరం

బీచ్ రోడ్డు: పిల్లల కోసం ఈ నెల 27వ తేదీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి స్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎరిబిక్స్, ఎయిర్ గన్, కాలిగ్రఫీ, చెస్, క్రికెట్, డ్యాన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, జుడో, కరాటే, గిటార్ అండ్ కీ బోర్డు, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, యోగా, తదితర అంశాలలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మే 31వ తేదీ వరకు సాగనున్న ఈ శిబిరంలో 5 నుంచి 17 ఏళ్ల వయస్సు వారు పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0891–2755826, 8297223480 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.